సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



సరిహద్దులో పంచాయితీ

కర్ణాటక రైతు సంఘం నాయకులు రాష్ట్ర సరిహద్దులో ధర్నా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



క్రీడల హబ్‌గా తెలంగాణ

తెలంగాణను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతామని ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.7 /16.9

ఉదయం చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎస్‌ఈ తిరుపతిరావు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

27, 28 తేదీల్లో వైజ్ఞానిక ప్రదర్శన

గద్వాలటౌన్: విద్యార్థుల్లోని వినూత్న ఆలోచనలకు రూపం కల్పించి వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యాశాఖ ఓ వేదిక ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. గురువారం స్థానిక బాలభవన్‌లో డీఈఓ అబ్దుల్ ఘనీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎంఈఓ, హెచ్‌ఎం, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం, ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వైజ్ఞానిక ప్రదర్శనపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల చేత మెరుగైన ప్రాజెక్టులను రూపొందించేలా వారిని సిద్ధం చేయాలని డీఈఓ సూచించారు. ఈ సారి జిల్లా నుంచి ఒక్క ప్రదర్శన అయినా జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా కృషి చేయాలన్నారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయడానికి కమిటీలను ఏర్పాటు చేస్తామని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

29 మంది వార్డు అధికారుల నియామకం

గద్వాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీకి కొత్త వార్డు అధికారులను, ఉద్యోగులను కేటాయించింది. గత నెలలో టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–4 పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం 29 మంది అభ్యర్థులను గద్వాల మున్సిపాలిటీకి పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో 25 మంది వార్డు అధికారులు, ఇద్దరూ జూనియర్ అకౌంటెంట్లు, ఇద్దరూ జూనియన్ అసిస్టెంట్లు ఉన్నారు. మున్సిపల్ కార్యాలయంలో 13 మంది వార్డు అధికారులు, ఇద్దరూ అకౌంటెంట్లు రిపోర్టు చేశారు. మరో 14 మంది రిపోర్టు చేయాల్సి ఉంది. మున్సిపల్ కమిషనర్ దశరథ్ వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. వార్డు అధికారుల నియామకంతో మున్సిపాలిటీలో సేవలు మెరుగుపడనున్నాయి. పౌరసేవలు సత్వరం అందే అవకాశం ఉంది.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలి



గద్వాలటౌన్: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు వివిధ సంఘాల నాయకులు వేరువేరుగా సంపూర్ణ మద్దతును ప్రకటించారు. గురువారం సైతం కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్‌ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్‌ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్లకార్డులు చేతబట్టి దీక్ష చేపట్టారు. ఉద్యోగాలను రెగ్యులర్ చేసి తమ జీవితాలలో వెలుగులు నింపాలంటూ దీక్ష శిబిరంలోని ఉద్యోగులు క్రొవ్వొత్తులు వెలగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. 20 ఏళ్లుగా పనిచేస్తూ గురుకులాలతో సమానంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నా శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రతి ఉద్యోగికి జీవిత భీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు హుస్సేనప్ప, గోపాల్, ప్రణీత, శేషన్న, ఖాజా, సమి, శ్యామ్, శ్రీనివాసులు, రామంజనేయులు, ఎస్‌ఓలు ఆసియాబేగం, గోపిలత, శ్రీదేవి, పద్మ, చంద్రకళ పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ..!

పత్తి కొనుగోళ్లకు తరచూ అంతరాయం



అలంపూర్‌లోని సీసీఐ కేంద్రం ఏర్పాటు చేసిన మిల్లులో పేరుకుపోయిన పత్తి నిల్వలు

- సీసీఐ కేంద్రం వద్ద రోజుల తరబడి రైతుల పడిగాపులు..
- జిల్లాలో ఒకే పత్తి కొనుగోలు కేంద్రం.. పేరుకుపోతున్న నిల్వలు
- ఇప్పటి వరకు 45,296 క్వింటాళ్ల పత్తి కొనుగోలు
- నిరంతరాయంగా కొనుగోళ్లు జరపాలని రైతుల వేడుకోలు



కొనుగోళ్లు నిలిచిపోవడంతో కేంద్రం బయట నిలిచిన పత్తి ట్రాక్టర్లు

అలంపూర్: పత్తి పంట సాగు ఒక ఎత్తు అయితే.. దానిని విక్రయించడం మరో ఎత్తులా మారింది. సీసీఐ కేంద్రం వద్ద పత్తి విక్రయించాలంటే ముందుగా టోకెన్ తీసుకోవాలి.. దానికి బారెడు క్యూలో గంటలపాటు వేచి ఉండాలి. తీరా టోకెన్ దక్కితే కేటాయించిన తేదీ రోజు వాహనంలో పత్తి లోడ్ చేసుకొని కేంద్రం వద్దకు రావాలి. ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. జిల్లాలో ఒకే ఒక్క పత్తి కొనుగోలు కేంద్రం (సీసీఐ) ఉండగా.. అది కూడా తరచూ కొనుగోళ్లు నిలిపివేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రం ప్రారంభించి 45 రోజులు అయితే.. ప్రభుత్వ సెలవులు, నిల్వలు పేరుకుపోయాయి తదితర కారణాలు చెబుతూ కేవలం 29 రోజులు మాత్రం కొనుగోళ్లు జరిపారు. దీంతో సీసీఐ కేంద్రం వద్ద నిత్యం వాహనాలు బారులు తీరగా.. తమ టోకెన్ నెంబర్ ఎప్పుడు వస్తుందో అంటూ రైతులు అక్కడే వంటలు చేసుకుంటూ చలికి ఇబ్బందులు పడే దుస్థితి నెలకొంది.

జిల్లాలో ఒకే సీసీఐ కేంద్రం

జిల్లాలో ఈ ఏడాది ఒకే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీవరసిద్ధి వినాయ కాటన్ మిల్లులో కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదనలు పంపినా.. ఒక్క అలంపూర్ నియోజకవర్గంలోనే ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దీంతో జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన రైతులు ఇక్కడికే రావాల్సి వస్తోంది. దీంతో పండించిన పత్తిని అమ్ముకోవడానికి అటు దూరభారం.. ఇటు వాహనాల అద్దె ఖర్చులు.. ఎదురుచూపులతో ఇబ్బందులు తప్పడంలేదు.

45,296 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో 1,360 మంది రైతుల నుంచి 45296.50 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. ఈ పత్తి విలువ సుమారు రూ.33.17 కోట్లు. సీసీఐ కేంద్రంలో పత్తికి తేమ 8 నుంచి 12 శాతం, నాణ్యతతో ఉన్న పత్తికి కనీస మద్దతు ధర క్వింటాకు తక్కువగా రూ.7121 నుంచి రూ. 7521 అందించారు. ప్రస్తుతం క్వింటాకు మద్దతు ధర రూ.7121 నుంచి రూ.7421 చెల్లిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ.6500 నుంచి రూ. 6800 వరకు పలుకుతుంది. సీసీఐ కేంద్రంలో క్వింటాకు రూ.600 నుంచి 800 వరకు అదనంగా ఉండటంలో రైతులు సీసీఐ కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు.

మూడు రోజులు నిలిపివేత

ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీవరసిద్ధి వినాయ కాటన్ మిల్లులో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేశారు. తాజాగా పత్తి కొనుగోళ్లు ఈ నెల 20, 21, 22 మూడు రోజులపాటు నిలిపివేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎల్లస్వామి తెలిపారు. కొనుగోలు కేంద్రంలో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోళ్లు నిలిపివేశారు. తిరిగి ఈ నెల 23వ తేదీన కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇదిలాఉండగా, నవంబర్ 4వ తేదీన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రం ఏర్పాటు చేసిన పత్తి మిల్లులో నిల్వల సామర్థ్యం తక్కువగా ఉండటంతో 45 రోజుల్లో కేవలం 29 రోజులు కొనుగోళ్లు జరగగా మిగిలిన 16 రోజులు సెలవులే ఉన్నాయి. కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగకపోవడంతో రైతులు రోజుల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. టోకెన్లు పొందడానికి కొన్ని రోజులు, టోకెన్లు పొందిన తర్వాత అమ్మడానికి కొన్ని రోజులు పడిగాపులు తప్పడం లేదు. కేంద్రంలో రోజుకు 1500 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసే అవకాశం ఉంది. అంత కంటే ఎక్కువ పత్తి కేంద్రానికి వస్తోంది. చేసేదిలేక అధికారులు శని, ఆదివారాలతోపాటు అదనంగా సెలవులు ప్రకటించి తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపివేస్తున్నారు.

మూడు రోజులైంది వచ్చి..



నాకున్న రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. రెండు ఎకరాలకు కలిపి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. బయటి మార్కెట్‌లో ధర లేకపోవడంతో దూరమైన సీసీఐ కేంద్రానికి వచ్చాను. ఇక్కడికి రావడానికి ట్రాక్టర్ కిరాయి రూ.4 వేలు అయ్యింది. ఇక్కడికి వచ్చి మూడు రోజులు అవుతుంది. కానీ సెలవని కాంటా వేయడం లేదు. చేసేది లేక ఇక్కడే ఉంటున్నాను.

– సత్యారెడ్డి, పత్తి రైతు, మల్లెందొడ్డి, మల్దకల్ మండలం

సామర్థ్యం తక్కువగా ఉండటంతోనే..



సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంది. ఎక్కువ పత్తి నిల్వ చేస్తే వేడి పెరిగి అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. ఇటీవలే చిన్నపాటి అగ్నిప్రమాదం జరిగింది. అందుకే అన్ని విషయాలు దృష్టిలో ఉంచుకొని రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నాం. రైతుల నుంచి చివరి వరకు పత్తి కొనుగోలు చేస్తాం.

– ఎల్లస్వామి, మార్కెట్ యార్డు కార్యదర్శి, అలంపూర్

నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: జిల్లాలో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ, టీఎస్ ఎంఐడీసీ, ఈడబ్ల్యూడీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న పనుల పురోగతి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కేజీబీవీ, బాలసదన్ నిర్మాణాలు పూర్తి చేసి నివేదికలు అందించాలన్నారు. అదేవిధంగా మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలో కొనసాగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బీటీరోడ్లు, కనెక్టింగ్ రోడ్లు, సీసీ రోడ్లు, భవనాల నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖలలో కొనసాగుతున్న పనులన్నీ పూర్తి చేయాలని, అదేవిధంగా పనుల పురోగతిపై త్వరలోనే క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సమన్వయంతో..

గట్టు మండలంలో వైద్య, విద్యా, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో గట్టు మండల అభివృద్ధి పై అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంలంలో కొన్ని శాఖల అధికారులు నిర్ధేశించిన లక్ష్యాలు పూర్తి చేయడంలో వెనకబడి ఉన్నారని పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. త్వరలోనే కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాటు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ

గద్వాలటౌన్ : క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు పేరు తీసుకురావాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ పేర్కొన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోటీలలో భాగంగా గురువారం తాయిక్వాండో, హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, సోమనాద్రి స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలను అడిషినల్ కలెక్టర్ లక్ష్మినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు, శారీరక దృఢత్వానికి కరాటే దోహదం చేస్తుందని చెప్పారు. క్రీడలను స్ఫూర్తిగా తీసుకొని ఆరోగ్యకర వాతావరణంలో సానుకూల దృక్పథంతో జయాపజయాలను స్వీకరించాలన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే సీఎం కప్ ప్రధాన ఉద్దేశమన్నారు. డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్ మాట్లాడుతూ క్రీడాకారులను ఉత్సాహపర్చడమే కాకుండా వారి మధ్య స్నేహభావం పెంపొందించేందుకు పోటీలు తోడ్పడుతుందన్నారు. చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతోపాటు, మానసిక దృఢత్వం లభిస్తుందని చెప్పారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, పీఈటీలు నగేష్‌బాబు, హైమవతి, సుహాసిని, కృష్ణయ్య, శ్రీనివాసులు, రత్నమాల, నిర్మల, మల్లీశ్వరి, నర్సింహారాజు, సతీష్‌కుమార్, ఆనంద్‌కుమార్, స్వప్న, అరుణతార, రఘు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో తనిఖీలు ముమ్మరం



ధాన్యం లోడుతో వచ్చిన లారీని సరిహద్దు చెకపోస్టు వద్ద నిలిపిన పోలీసులు

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని జాతీయ రహదారిపై తనిఖీలు కొనసాగుతున్నాయి. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయరహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు నిరంతర తనిఖీలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే ధాన్యపు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్లకు బోనస్ ఇచ్చి మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తుంది. దీంతో పక్క రాష్ట్రాల ధాన్యం రాష్ట్రంలోకి ప్రవేశించకుండా ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం రాత్రి ఏపీ రాష్ట్రం నుంచి ధాన్యంతో వచ్చిన 9 లారీలను తనిఖీ అధికారులు నిలిపివేసినట్లు తెలిపారు. ధాన్యపు లారీలో రెండు సెస్ చెల్లించడంతోపాటు వేబిల్లు ఉండటంతో రెండు వాహనాలను గురువారం రాష్ట్రంలోకి ప్రవేశించడానికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన 7 లారీలలో ధాన్యానికి సెస్ చెల్లించినప్పటికి వే బిల్లులు లేకపోవడంతో తిరిగి వెనక్కి పంపినట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి గంటా కవితాదేవి

గద్వాల క్రైం: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని.. వాటిని చేరుకునేందుకు పట్టుదలతో చదవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి గంటా కవితాదేవి అన్నారు. గురువారం బుర్దపేట కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు మెనూ ప్రకారం ఆహారం అందజేస్తున్నారా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలోని సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అయితే పాఠశాల ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని జడ్జి దృష్టికి విద్యార్థులు తీసుకువచ్చారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే రాతపూర్వకంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గద్వాల న్యూటౌన్: జిల్లాలో ప్రథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18 నుంచి 30ఏళ్లలోపు వయసు గల యువతకు 30 రోజులు ఉచితంగా ఎలక్ట్రీషియన్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ ఇంటర్, డిగ్రీ, ఎలక్ట్రీషియన్ (ఐటీఐ ఎలక్ట్రీషియన్) అర్హత కల్గి, శిక్షణ పూర్తి చేసిన వారికి ఎన్‌ఎస్‌డీసీ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నం. 6303430789, 9030421360 ను సంప్రదించాలని సూచించారు.

నల్లమలలో కారిడార్

సురక్షిత ప్రయాణానికి హైదరాబాద్- శ్రీశైలం వరకు ఫోర్‌లైన్ల రహదారి

- మన్ననూర్- పాతాళగంగ మార్గంలో 62 కి.మీ., ఎలివేటెడ్ కారిడార్
- ప్రాజెక్టు వ్యయం అంచనా రూ.7,700 కోట్లు
- శ్రీశైలం డ్యాం వద్ద నాలుగు వరుసల భారీ వంతెన
- మల్లన్న సన్నిధికి తగ్గనున్న ప్రయాణ భారం



హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి

సాక్షి, నాగర్‌కర్నూల్/ అచ్చంపేట: ఒకవైపు అరుదైన వన్యప్రాణులు, వృక్షజాతులను సంరక్షిస్తూనే.. మరోవైపు ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రయాణం సాఫీగా సాగేందుకు నల్లమల వేదిక కానుంది. నల్లమల అటవీ ప్రాంతం గుండా సుమారు 62 కి.మీ., మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో హైదరాబాద్- శ్రీశైలం రహదారి రూపురేఖలు మారిపోనున్నాయి. ఈ మార్గంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంతో పాటు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల జీవనానికి ఆటంకం కలిగించకుండా భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. రూ.7,700 కోట్ల నిధులతో ఈ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టేందుకు అవసరమైన డీపీఆర్ రూపొందించేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

30 అడుగుల ఎత్తులో..

హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి–765 గుండా శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులతో రద్దీ క్రమంగా పెరుగుతోంది. ఈ మార్గంలో సుమారు 62.5 కి.మీ., మేర నల్లమల అటవీ ప్రాంతం గుండా ప్రయాణించాల్సి ఉంటుంది. మన్ననూరు గ్రామం నుంచి పాతాళగంగ వరకు సుమారు 30 అడుగుల ఎత్తులో భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. దీంతో వన్యప్రాణుల భయం లేకుండా ఎత్తు నుంచే గమ్యాన్ని చేరుకునేందుకు వీలుంది. హైదరాబాద్- ఏపీలోని ప్రకాశం మధ్య 45 కి.మీ., మేరకు దూరభారం తగ్గనుంది.

డీపీఆర్ పూర్తయితే భూసేకరణ

హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణ కోసం 2022- 23లో కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఈ మార్గంలోని 128.6 కి.మీ., నుంచి 191 కి.మీ., వరకు రోడ్డు విస్తరణకు ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. జనావాసాలు ఉన్న మన్ననూర్, దోమలపెంటల వద్ద బైపాస్, మూలమలుపులు ఉన్నచోట నేరుగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదనలు ఉన్నాయి. డీపీఆర్ పూర్తయితే అచ్చంపేట మండలం బ్రాహ్మణపల్లి- మన్ననూర్ నుంచి ఈగలపెంట- పాతాళగంగ వరకు సుమారు 147.31 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంటుందని అంచనా. ఇందులో 128.63 హెక్టార్లు అటవీ భూమి కాగా.. మరో 18.68 హెక్టార్ల అటవీయేతర భూమి సేకరించనున్నారు.


24 గంటల పాటు రాకపోకలు..

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం గుండా ఈ రహదారి వెళ్తుండటంతో ప్రస్తుతం మన్ననూర్, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోకలను అటవీశాఖ అనుమతించడం లేదు. వన్యప్రాణుల సంరక్షణ దృష్ట్యా వాహనాల వేగం సైతం గంటకు 30 నుంచి 40 కి.మీ.కే పరిమితమవుతోంది. ఈ రోడ్డుపై నిత్యం 8 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా.. శని, ఆదివారాల్లో రద్దీ 10 వేల వాహనాలకు మించుతోంది.

డ్యాం వద్ద ఐకానిక్ బ్రిడ్జి

హైదరాబాద్- శ్రీశైలం- తోకపల్లి జాతీయ రహదారిలో శ్రీశైలం డ్యాం వద్ద ఐకానిక్ వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం ఈ మార్గంలో పాతాళగంగ వద్ద ఇరుకైన బ్రిడ్జి ఉంది. ఘాట్ రోడ్డు మార్గంలో ప్రయాణ సమయం తగ్గించడంతో పాటు తెలంగాణలోని ఈగలపెంట, ఆంధ్రప్రదేశ్‌లోని సున్నిపెంట గ్రామాల మధ్య కృష్ణానదిపై 173 మీటర్ల ఎత్తు, 670 మీటర్ల పొడవైన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రతిపాదించారు. తెలంగాణ వైపు 180, ఏపీ వైపు 340 మీటర్ల సపోర్ట్ బ్రిడ్జి డిజైన్ రూపొందించారు. దీంతో శ్రీశైలానికి మరో 9 కి.మీ., దూరం తగ్గుతుంది.


ప్రతిపాదనలు పూర్తయ్యాయి..



హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి రెండు వరుసల నుంచి నాలుగు వరుసలకు విస్తరించేందుకు ప్రతిపాదనలు పూర్తయ్యాయి. నల్లమలలో ఎలివేటెడ్ కారిడార్‌తో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోనున్నాయి. ఒకవైపు వన్యప్రాణులను సంరక్షిస్తూనే.. శ్రీశైలం వెళ్లే ప్రయాణికులకు ఈ కారిడార్ మేలు చేయనుంది. దక్షిణకాశీగా పిలిచే శ్రీశైలం పుణ్యక్షేత్రానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం జరిగితే నిత్యం రద్దీగా ఉండే శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించే అవకాశం ఉంది.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

సానుకూలంగా స్పందన..



హైదరాబాద్- శ్రీశైలం రోడ్డు విస్తరణకు సీఎం రేవంత్‌రెడ్డి పలు మార్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం కూడా సానుకూలంగా స్పందించింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని భూత్పూర్- మన్ననూర్- మద్దిమడుగు- గంగులకుంట (తెలంగాణ)- సిరిగిడిపాడు (ఆంధ్రప్రదేశ్) వరకు ఒక రహదారి, పుల్లూరు- అలంపూర్ మీదుగా కొల్లాపూర్- అచ్చంపేట- దేవరకొండ- నల్లగొండ వరకు మరో జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం.

– మల్లు రవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

- తల్లిదండ్రులు ఫోన్‌లో వద్దని వేడుకున్నా పట్టించుకోని వైనం


బాబు (ఫైల్)

మానవపాడు: అప్పులు ఎక్కువయ్యాయని.. వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటు న్నానంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బోరవెల్లి స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. రాజోలి మండలం నసనూర్‌కు చెందిన బాబు (23) అయిజలో ఓ వస్త్ర దుకాణం నిర్వహిస్తుండేవాడు. గిరాకీ లేకపోవడం.. అప్పులు పెరగడంతో చేసేది లేక బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బోరవెల్లి స్టేజీ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న వేప చెట్టు వద్దకు వెళ్లాడు. స్నేహితుడు మహేశ్‌కు ఫోన్‌చేసి తాను ఉరేసుకొని చనిపోతున్నానని చెప్పడంతో అతడు వెంటనే బాబు తల్లిదండ్రులకు కాన్ఫరెన్స్ కాల్ చేశాడు. తల్లిదండ్రులు చనిపోవద్దు.. తాము డబ్బులు తెచ్చి అప్పులు చెల్లిస్తామంటూ రోధిస్తూ వేడుకున్నా పట్టించుకోకుండా ఉరేసుకొని మృతిచెందాడు. తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: మద్యానికి బానిసై క్షణికావేశంలో ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్‌ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం. .మండల పరిధిలోని కోడూర్ గ్రామానికి చెందిన రాఘవేందర్‌గౌడ్(50) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడని కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసై క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరూ కొడుకులు ఉన్నారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూరుకు చెందిన వెంకటయ్య (60) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 4న వ్యవసాయ పొలంలో పనులు చేస్తూ.. ప్రమాదవశాత్తు కింద పడటంతో గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌బీఐ కేసు అంటూ టోకరా

జడ్చర్ల: 'మీపై ఆర్‌బీఐ కేసు నమోదైంది. వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వచ్చి కలవండి' అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన ఫోన్‌కు బెంబేలు పడిన ఓ వ్యక్తి రూ. 2.20 లక్షల దాక నష్టపోయిన ఘటన జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. బాధితుడి వివరాల మేరకు.. స్థానికంగా ఉన్న ఓ గోదాముల సంస్థ మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌కు పది రోజుల క్రితం ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాము రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి మాట్లాడుతున్నామని.. మీ పేరు, ఆధార్ నంబర్ ఇది అంటూ పలు వివరాలు చెప్పి నమ్మబలికారు. హైదరాబాద్‌లోని సుల్తాన్ బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌బీఐ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైందని తెలిపారు. దీంతో భయపడిపోయిన ప్రసాద్.. తదుపరి వారు చెప్పిన విధంగా పలు దఫాలుగా దాదాపు రూ. 2.20లక్షల దాక వారు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశారు. చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి, జడ్చర్ల పోలీసులను ఆశ్రయించారు. సైబర్ క్రైం 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశారు. వాట్సాప్ నంబర్‌కు సంబంధించి ఎస్‌బీఐ లోగో ఉండటంతో నిజంగానే ఉండవచ్చని నమ్మినట్లు బాధితుడు పేర్కొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడికి..

- పదేళ్ల జైలు.. రూ.55 వేల జరిమానా

మక్తల్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన ఓ యువకుడికి గురువారం నారాయణపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ పదేళ్ల జైలుశిక్ష.. రూ.55 వేల జరిమానా విధించారని ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మక్తల్‌లోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన రాజేష్‌గౌడ్ ఓ యువతిని ప్రేమిస్తున్నానని చెప్పి హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. కొంతకాలం తర్వాత ఇంట్లో పెద్దవాళ్లు ఒప్పుకోవడం లేదంటూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. వేధించడంతో పాటు అసభ్యకరంగా మాట్లాడటంతో 20.8.2021న బాధితురాలు రాజేశ్‌గౌడ్‌పై మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ రాములు, సీఐ శంకర్ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ వేశారు. ప్రస్తుత సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, కోర్టు డ్యూటీ అధికారులు కబీర్, భీంరాజ్, కోర్టు లైజనింగ్ అధికారి కృష్ణయ్యగౌడ్ కోర్టులో సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టగా పీపీ ఆకుల బాలప్ప వాదనలు వినిపించారు. గురువారం నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు, కోర్టు డ్యూటీ అధికారులతో పాటు పీపీని ఎస్పీ అభినందించారు.

సరిహద్దులో ధాన్యం పంచాయితీ

- ధాన్యం విక్రయ విషయంలో తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు స్పందించాలని డిమాండ్


రాష్ట్ర సరిహద్దులో నిలిచిన వాహనాలు


తెలంగాణ సరిహద్దులో నిరసన తెలుపుతున్న కర్ణాటక రైతులు

కృష్ణా: తెలంగాణ– కర్ణాటక రైతుల ధాన్యం విక్రయించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించాలని గురువారం కర్ణాటక రైతు సంఘం నాయకులు రాష్ట్ర సరిహద్దులో ధర్నా నిర్వహించారు. అంతకు ముందు కర్ణాటకలోని శక్తినగర్ పోలీసులు కర్ణాటక రైతుల ధర్నా విషయం తెలుసుకొని ఉదయం 7 గంటల నుంచే తెలంగాణ సరిహద్దుకు చేరుకొని ఇక్కడి నుంచి వస్తున్న ధాన్యం వాహనాలను నిలిపివేశారు. ఈ క్రమంలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ తాము తెలంగాణ ప్రభుత్వానికి పన్ను చెల్లించి.. రైస్‌మిల్లులకు ధాన్యం తీసుకెళ్తుంటే అక్రమంగా మా రాష్ట్రంలోకి వస్తున్నాయని తెలంగాణ పోలీసులు వాహనాలను సీజ్ చేస్తున్నారని ఆరోపించారు. వారం రోజుల క్రితం కూడా తాము అన్ని రకాల అనుమతులతోనే హైదరాబాద్‌కు ధాన్యం తరలిస్తుంటే అడ్డుకున్నారన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణకు చెందిన రైతుల ధాన్యం సైతం తమ రాష్ట్రంలోకి రానివ్వకుండగా గురువారం అడ్డుకున్నట్లు వివరించారు. తమ ఇబ్బందులు ప్రభుత్వాలకు తెలియాలనే ఉద్దేశంతోనే ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ విషయంపై ప్రభుత్వాలు స్పందించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. కర్ణాటక రైతు సంఘం నాయకులు సరిహద్దు చెక్‌పోస్టు వద్దకు చేరుకొని తెలంగాణ ధాన్యం వాహనాలను వెనక్కి వెళ్లాలని చెప్పడంతో ఇటు తెలంగాణ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు.

నందిన్నె చెక్‌పోస్టులో వడ్ల లారీల నిలిపివేత

కేటీదొడ్డి: రాష్ట్రంలో పండించిన వరి ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320 మద్దతు ధరతోపాటు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ ఇవ్వడంతో కర్ణాటక వడ్లను దళారులు తెలంగాణలోని పలు మిల్లుల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి వరిధాన్యంతో వస్తున్న లారీలను సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో జోగుళాంబ గద్వాల జిల్లా సివిల్ సప్లయ్ అధికారుల ఆదేశాల మేరకు గురువారం మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద అధికారులు కొన్ని వడ్ల లారీలను వెనక్కి పంపించారు. దీంతో కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లా సింగనేడి చెక్‌పోస్టు నుంచి నందిన్నె చెక్‌పోస్టు వరకు వరిధాన్యం లారీలు నిలిచిపోయాయి. ఆ తర్వాత డీఎస్‌ఓ అధికారుల ఆదేశాల మేరకు వే బిల్లులు ఉన్నవాటిని మాత్రమే గద్వాల జిల్లా మీదుగా తరలించడానికి అనుమతించారు. పదుల సంఖ్యలో లారీలకు రిలీజ్ ఆర్డర్ ఇవ్వడంతో వదిలేసినట్లు తెలిసింది.


సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిలిచి ఉన్న వడ్ల లారీలు

అక్కడే అప్పు తెచ్చాం..



మేం కర్ణాటకలోని కమీషన్ ఏజెంట్ వద్ద పంటల కోసం రూ.55 వేల అప్పు చేశాం. ఆ అప్పు తీర్చేందుకే మా ధాన్యం కర్ణాటకలోని రాయచూర్ మార్కెట్‌కు తీసుకెళ్తున్నాం. ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వంతో మాట్లాడాలి కానీ మా రైతుల వాహనాలను నిలిపివేస్తే ఎలా.

– వెంకటమ్మ, మల్లేపల్లి మాధారం గ్రామం, మక్తల్ మండలం

రైతులను అడ్డుకోవద్దు..



మేం మా పంటలు వేసే సమయంలో కర్ణాటకలోని రాయచూర్ కమీషన్ ఏజెంట్ వద్ద రూ.2 లక్షల అప్పు చేశాం. ఆ అప్పు తీర్చేందుకే వాహనంలో వరిధాన్యం రాయచూర్ మార్కెట్‌కు తీసుకెళ్తున్నాం. కర్ణాటక రైతులు మా ధాన్యం వాహనాలను అడ్డుకోవడం తగదు.

– నర్సింహులు, చందాపూర్ గ్రామం, మక్తల్ మండలం

మాకూ న్యాయం చేయాలి..



మాకు న్యాయం జరిగే వరకు తెలంగాణలోని రైతుల ధాన్యం రానివ్వం. ప్రభుత్వ అనుమతితో తీసుకెళ్తుంటే అక్రమ ధాన్యం అని సీజ్ చేస్తున్నారు. మేం హైదరాబాద్‌లోని మార్కెట్‌కు గత కొన్నేళ్లుగా ధాన్యం తరలిస్తున్నాం. ఇప్పుడు మాత్రం అధికారులు మా ధాన్యం తీసుకెళ్లనీయకుండా అడ్డుకోవడం సరైంది కాదు.

– మల్లికార్జున్, రైతు సంఘం నాయకుడు, రాయచూర్ జిల్లా, కర్ణాటక

మా వాహనాలు సీజ్ చేస్తున్నారు..



ప్రభుత్వ అనుమతులు ఉన్నప్పటికీ తెలంగాణ అధికారులు కర్ణాటక ధాన్యం వాహనాలను సీజ్ చేస్తున్నారు. మేం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం లేదు. తెలంగాణలోని చెక్‌పోస్టుకు ట్యాక్స్ చెల్లించి రైస్ మిల్లులకు తీసుకెళ్తున్నాం. ఈ విషయమై అటు తెలంగాణ, ఇటు కర్ణాటక ప్రభుత్వాలు స్పందించి న్యాయం చేయాలి.

– చామరస మాలిపాటిల్, రాయచూర్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు, కర్ణాటక

జూరాలకు స్వల్ప వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 1,116 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందన్నారు. ఆవిరి రూపంలో 90 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 528 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 278 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 896 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.164 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 7,472 క్యూసెక్కుల తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి ఇరవై నాలుగు గంటల వ్యవధిలో 7,472 క్యూసెక్కుల నీటిని తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,695, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 863.2 అడుగులు కాగా 116.0692 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ నుంచి 200 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 270 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 35 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని నియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మహబూబ్‌నగర్ క్రైం: గోదాం నుంచి అక్రమంగా ఇతర రాష్ట్రానికి తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఆర్టీఓ కార్యాలయంలో సమీపంలో ఉన్న గోదాం నుంచి గురువారం ఉదయం ఒక లారీ, డీసీఎంలలో 70 నుంచి 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారనే సమాచారం రావడంతో తనిఖీలు చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి లారీ, డీసీఎం సీజ్ చేసినట్లు తెలిపారు. దుర్గా ఇండస్ట్రీస్ నుంచి రేషన్ బియ్యం సరఫరా అవుతున్నట్లు విచారణలో తేలిందని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

తుంగభద్ర నదిలో మళ్లీ లొల్లి


తుంగభద్ర నదిలో ట్రాక్టర్‌పై వివాదం జరుగుతున్న ప్రదేశానికి వెళ్తున్న ఎస్‌ఐ జగదీష్

రాజోళి: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న తుంగభద్ర నదిలో ఇసుక తరలింపుపై మళ్లీ లొల్లి జరిగింది. సరిహద్దు పేరుతో అనుమతులు ఉన్న జోగుళాంబ గద్వాల జిల్లా ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేయకుండా ఉండేందుకు ప్రయత్నించారు. అయితే రాజోళి ఎస్‌ఐ చొరవతో ఎలాంటి సమస్య లేకుండా జిల్లాకు చెందిన ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో వచ్చాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇరు రాష్ట్రాల మధ్యనున్న తుంగభద్ర నదిలో ఇసుక తీసుకోవడం అనేది దశాబ్దాల కాలంగా జరుగుతున్న ప్రక్రియ. తాజాగా ఏపీలో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక, గద్వాల జిల్లాలో అనుమతులు ఉన్న వాహనాలకు సైతం ఇసుక అందడం లేదు. ఇదేంటని అడిగితే తమ బార్డర్‌లోకి వచ్చారంటూ ఏపీ అధికారులు అక్రమంగా కేసులు నమోదు చేశారు. గతంలో ఇలాంటి ఘటనలు జరగలేదు. ఏపీలో కొత్త ప్రభుత్వం వచ్చాక ఇలాంటి ఘటనలు నమోదవుతున్నాయి. తాజా పరిస్థితులపై ఈ నెల 8న 'సాక్షి'లో 'హద్దు దాటుతున్నారు' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై రెండు రాష్ట్రాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాజోళి మండలం తూర్పుగార్లపాడు గ్రామంలో ప్రభుత్వ అనుమతులతో నదిలో ఇసుక తీసేందుకు వెళ్లిన ట్రాక్టర్లను గురువారం కర్నూల్ జిల్లా ఆర్.కొంతలపాడు గ్రామస్తులు అడ్డుకోవడంతో మళ్లీ ఇసుక వివాదం తలెత్తింది. వాహనాలు నదిలోకి రాకూడదనే అంశం తెరపైకి తెచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జగదీష్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. ప్రతిసారి ఇలా సరిహద్దు వివాదం తీసుకురావడం సరికాదని.. కొన్నేళ్లుగా ఇసుక తీసుకునేందుకు ఎక్కడికి వెళ్తున్నారో ప్రస్తుతం అక్కడే తీస్తున్నారన్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా పరిశీలించగా.. అది కూడా జోగుళాంబ గద్వాల జిల్లా సరిహద్దులోనే ఉన్నట్లు తేలిందని తెలిపారు. జిల్లా ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసేందుకు అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. వివాదం పెరగకుండా సమస్యను పరిష్కరించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

సీనియర్ క్రీడాకారుడు సాధిక్ అలీ మృతి

- సంతాపం ప్రకటించిన క్రీడా సంఘాలు


సాధిక్ అలీ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారుడు, సాఫ్ట్‌బాల్ కోచ్ సాధిక్ అలీ (50) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. క్రీడలే ప్రాణంగా భావించి ఎప్పుడూ మైదానంలో ఉంటూ ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే సాధిక్ అలీ లేరనే వార్త క్రీడావర్గాల్లో తీరని బాధను మిగిల్చింది. జిల్లాలోని వివిధ క్రీడాసంఘాలు సాధిక్ అలీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 18 నుంచి ప్రారంభమైన రాష్ట్రస్థాయి సీఎం కప్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా బాలుర జట్టుకు కోచ్‌గా సాధిక్ అలీ వెళ్లారు. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో అకస్మాత్తుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడడంతో వెంటనే చికిత్స కోసం అంబులెన్స్‌లో గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే గురువారం మధ్యాహ్నం మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

కారుకు నిప్పుపెట్టిన దుండగులు

తెలకపల్లి: ఇంటి ముందు నిలిపిన కారుకు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటన తెలకపల్లి మండలం పెద్దూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల మేరకు.. పెద్దూరుకు చెందిన సందీప్‌రెడ్డి తన కారును ఎప్పటిలాగానే బుధవారం తన ఇంటి ముందు నిలిపారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టడంతో ముందుభాగం కాలిపోయింది. అయితే అదే గ్రామానికి చెందిన జక్క శేఖర్‌రెడ్డిపై అనుమానం వ్యక్తం చేస్తూ.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదనపు కట్నం వేధింపుల కేసులో ఆరుగురికి జైలుశిక్ష

కోస్గి రూరల్: అదనపు కట్నం కోసం చిత్రహింసలు పెట్టిన ఆరుగురికి 18 నెలల జైలుశిక్ష, రూ. 2,500 జరిమానా విధిస్తూ.. కోస్గి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్హిన్‌బేగం తీర్పు ఇచ్చారు. సీఐ దస్రూనాయక్ వివరాల మేరకు.. దమగ్నాపూర్‌కు చెందిన మునీరాబేగానికి 15 ఏళ్ల క్రితం కోస్గి మండలంలోని ముశ్రీఫా గ్రామానికి చెందిన అబ్దుల్ రజాక్‌తో వివాహమైంది. 2008లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అబ్దుల్ రజాక్ మృతిచెందాడు. అయితే బాధితురాలికి వచ్చిన ఇన్సూరెన్స్ డబ్బులను మునీరాబేగం మామ యూసుఫ్ తర్వాత ఇస్తానని తీసుకున్నాడు. కొన్ని రోజులకు అదనపు కట్నం తీసుకురావాలని అత్తింటి వారు ఆమెతో పాటు పిల్లలను ఇంటి నుంచి వెళ్లగొట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 2017 అక్టోబర్ 3న మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో యూసుఫ్, పాషా, మౌలానాతో పాటు మరో ముగ్గురు మహిళలకు న్యాయమూర్తి 18నెలల జైలుశిక్ష, రూ. 2,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

తాళాలు పగలగొట్టి రెండు ఇళ్లలో చోరీ

మరికల్: మండల కేంద్రంలో తాళం వేసిన రెండు ఇళ్లలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ రాము తెలిపిన వివరాలకు మేరకు.. మరికల్‌కు చెందిన పూలిమామిడి ఆంజనేయులు గొర్రెల మంద వద్దకు వెళ్లగా ఆయన కుటుంబ సభ్యులు, దండు శ్రీను కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇళ్లకు తాళం వేసి ఉండటాన్ని గుర్తించిన దుండగులు తాళాలను పగలగొట్టి ఆంజనేయులు ఇంట్లో 20 తులాల వెండి, తులం బంగారం, రూ. 30 వేల నగదు, దండు శ్రీను ఇంట్లో తులంన్నర బంగారం, రూ. 45 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధిత కుటుంబాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్‌టీం పోలీసులు వేలి ముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దొంగల ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ రాము వెల్లడించారు.

ఆర్టీసీ బస్సు నుంచి డీజిల్ చోరీ

లింగాల: మండల కేంద్రంలో నైట్ హాల్ట్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున డీజిల్ చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు వివరాల ప్రకారం కల్వకుర్తి డిపోకు చెందిన బస్సు రాత్రి 10 గంటల సమయంలో లింగాల కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ దగ్గర నైట్ హాల్ట్ చేశారు. డ్రైవర్, కండక్టర్ నిద్రిస్తున్న సమయంలో బస్సు ట్యాంక్ నుంచి 200 లీటర్ల డీజిల్ చోరీ చేశారు. డ్రైవర్ సుల్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని క్లూస్ టీంతో పరిశీలించారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

- రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

కొత్తపల్లి: రైతులు ఆయిల్‌పాం సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందొచ్చని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం కొత్తపల్లి మండలంలోని నిడ్జింత శివారులో లక్ష్మీనారాయణరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు ఆయిల్‌పాం సాగుపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జంగా రాఘవరెడ్డితో పాటు నారాయణపేట జిల్లా ట్రెయినీ కలెక్టర్ గరిమ నరుల, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ హార్టికల్చర్ శాస్త్రవేత్త సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జంగా రాఘవరెడ్డి మాట్లడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగు పెంచడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. వరికి బదులు ఆయిల్‌పాం సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా బలపడతారని వివరించారు.

ఉచితంగా మొక్కల పంపిణీ ..

రైతులకు ఉచితంగా మొక్కలు అందజేసి సాగుకు అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు అవగాహన పెంచుకొని ఆయిల్‌పాం సాగు చేయడం ద్వారా మన ప్రాతంలో పాంఆయిల్ తయారు చేసే యూనిట్లు ప్రారంభించే అవకాశం ఉంటుదన్నారు. నిడ్జింత గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి మాట్లడుతూ యాభై ఎకరాలలో నాలుగేళ్ల క్రితం ఆయిల్‌పాం మొక్కలు నాటామని తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పది ఎకరాల ఆయిల్‌పాం సాగు చేసే రైతుకు వారానికి రూ.25వేల ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, ఆయిల్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జ్ సమీన, మండల వ్యవసాయ అధికారి రమేష్, ఆయిల్‌పాం తోటల రైతులు హన్మిరెడ్డి, షేక్‌మిరాన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి

కోస్గి రూరల్: చిరుత దాడిలో ఆవు మృతిచెందిన ఘటన గుండుమాల్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చింతకాయల చిన్న రాములు పొలం కొత్తపల్లికి వెళ్లే దారిలో ఉంది. బుధవారం ఎప్పటిలాగే పశువులను మేపుకొని పొలంలోని కొట్టంలో కట్టేసి ఇంటికి వచ్చారు. గురువారం ఉదయం వెళ్లి చూసేసరికి ఆవు చనిపోయి కనిపించింది. ఆవు గొంతుపై గాయం కనిపించడంతో ఫారెస్ట్ అధికారి లక్ష్మణ్‌నాయక్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఘటన స్థలాన్ని పరిశీలించి చిరుత దాడి చేసి ఉండవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. వారం కిందట సమీప ప్రాంతంలోనే పశువులపై చిరుత దాడి చేసిందని తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంట్లోని వస్తువులు

కొత్తకోట రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన పెద్దమందడి మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పెద్దమందడికి చెందిన గొల్ల గోపాల్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అధికారులు సరఫరాను నిలిపివేశారు. స్థానిక యువత సహాయంతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంటి పైకప్పు సీలింగ్‌తో పాటు ఇంట్లో ఉన్న ఫర్నిచర్, విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. దాదాపుగా రూ.4లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు ఇంటి యజమాని గోపాల్ వాపోయాడు. దగ్ధమైన ఇంటిని పంచాయతీ కార్యదర్శి దిలీప్‌రెడ్డి పరిశీలించారు.

గుడిసె దగ్ధం

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లలో బుధవారం రాత్రి తూర్పటి కృష్ణయ్యకు చెందిన పూరిగుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం హైదరాబాద్‌లో పని చేస్తున్న కృష్ణయ్య, జయమ్మ దంపతులు బుధవారం గ్రామానికి వచ్చారు. రాత్రి కట్టెలపొయ్యి మీద వంట చేసుకొని భోజనం చేసి పక్కింటికి వెళ్లి నిద్రించారు. రాత్రివేళ కట్టెల పొయ్యి నుంచి నిప్పురవ్వలు పూరిగుడిసెపై పడి అంటుకొని మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న వ్యవసాయ పరికరాలు, వంటపాత్రలు, పలు రకాల వస్తువులు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మార్వై సుజాత గురువారం ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేశారు.

క్రీడల హబ్‌గా తెలంగాణ

- ప్రతిభను వెలికితీయడం కోసం సీఎం కప్
- క్రీడాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.370 కోట్లు కేటాయింపు
- రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి



ఏపీ జితేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎన్‌పీ వెంకటేశ్, క్రీడా సంఘాల ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: దేశంలోనే క్రీడల హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతామని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడం కోసం సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఏపీ జితేందర్‌రెడ్డిని జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్, క్రీడాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే గ్రామ, మండల స్థాయి సీఎం కప్ పోటీలు ముగిశాయని, జిల్లాస్థాయి పూర్తికావస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. పదేళ్లలో క్రీడాభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా క్రీడాకారుడు అయినందున క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు క్రీడాభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.50 కోట్లు ఇస్తే ఈ ప్రభుత్వం రూ.370 కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు బడ్జెట్ కేటాయించి క్రీడాభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఇప్పటికే వాలీబాల్ అకాడమీ మంజూరైందని, ఎంపికలు నిర్వహించి క్రీడాకారులకు శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ.వెంకటేశ్ మాట్లాడుతూ స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలని, ముఖ్యమైన క్రీడలకు కోచ్‌ల నియామకం చేపట్టాలని కోరారు. అనంతరం సీఎం కప్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో విన్నర్, రన్నర్‌జట్లకు జితేందర్‌రెడ్డి ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఎస్.శ్రీనివాస్, వివిధ క్రీడా సంఘాల నాయకులు కురుమూర్తిగౌడ్, జాకీర్, దూమర్ల నిరంజన్, జగన్‌మోహన్‌గౌడ్, వడెన్న, కె.రాములు, బాల్‌రాజు, విలియం, పీడీలు వేణుగోపాల్, రాంచందర్, నిరంజన్‌రావు, పరశురాం, కృష్ణయ్య, మొయిన్, అబ్దుల్లా, కరాటే మాస్టర్లు జి.కృష్ణయ్య, తాజుద్దీన్ పాల్గొన్నారు.